రక్షణ కల్పించాలి



అన్ని రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలి. మహిళా డాక్టర్లకు మాత్రమే కాకుండా ఎక్కడ మహిళలు పనిచేస్తున్నా, వారికి భద్రత ఉంటే ధైర్యంగా వారి పనులు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే నినాదాలు ఉన్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. మహిళా డాక్టర్లకు సరైన వసతులు కల్పించాలి.

– డాక్టర్ కిరణ్‌రిషిత, కో లొకేటెడ్ పీహెచ్‌సీ, పొదలకూరు

మహిళలు తలెత్తుకొని తిరగాలి



రాత్రివేళల్లో సైతం మహిళలు తలెత్తుకొని తిరగాలి. కోల్‌కతా ఘటన అమానవీయం. ఇలాంటి ఘటనలతో మహిళా డాక్టర్ల ధైర్యం సన్నగిల్లుతోంది. నైట్ డ్యూటీలు చేసే మహిళా డాక్టర్లకు రక్షణ కరువైతే విధులకు హాజరు కాలేరు. వీరికి అన్ని విధాలా రక్షణతో పాటు సౌకర్యాలు కల్పించాలి. లేదంటే పగటి వేళల్లో విధులు నిర్వర్తించేలా చూడాలి.

– డాక్టర్ శ్రీకావ్య, కో లొకేటెడ్ పీహెచ్‌సీ, పొదలకూరు

వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యత



ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది రక్షణను ప్రభుత్వమే బాధ్యతగా తీసుకోవాలి. ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలు మాలో భయాందోళనలు కలిగిస్తున్నాయి. డాక్టర్లంటే దేవుళ్లుగా భావించే మన దేశంలో ఇలాంటి దారుణాలు జరగడం బాధాకరం. మాకు కుటుంబాలు ఉంటాయనే విషయాన్ని అందరూ గుర్తెరగాలి. ప్రభుత్వం మాకు రక్షణ కల్పించాలి.

– అనూష, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఆత్మకూరు



క్లుప్తంగా

గ్రామదేవతలకు పొంగళ్లు



సర్పంచ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

మర్రిపాడు: మండలంలోని చిలకపాడులో గ్రామదేవతలు పోలేరమ్మ, అంకాలమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా బయలుదేరి ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం, ఆలయాల అభివృద్ధికి సహకరించిన సర్పంచ్ సిద్దంరెడ్డి రమాదేవిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



జలదంకి: జలదంకి నూతన ఎస్సైగా ఎస్డీ లతీఫ్‌ఉన్నీసా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్సైగా పనిచేస్తు న్న ఆదిలక్ష్మిని నెల్లూరు వీఆర్‌కు పంపారు. ఆమె స్థానంలో నెల్లూరులోని చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లతీఫ్‌ఉన్నీసాను జలదంకి ఎస్సైగా బదిలీ చేశారు. నూతన ఎస్సైకు పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

మాజీ సర్పంచ్ గుండాల మృతికి నివాళి



ఆత్మకూరు: మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో ఆత్మకూరు సర్పంచ్‌గా 1988–93 వరకు వ్యవహరించిన గుండాల హనుమాన్‌రెడ్డి శనివారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం పట్టణంలోని నివాసంలో ఉంచిన హనుమాన్‌రెడ్డి భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సర్పంచ్‌గా అందించిన సేవలను గుర్తు చేసుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు లోని హనుమాన్‌రెడ్డి ఇంటికి చేరుకుని హనుమాన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. హనుమాన్‌రెడ్డి కుమారుడు మెడికవర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణారెడ్డిని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కంచి పరమేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శ్రీధర్‌రెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

దుత్తలూరు: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలోని విద్యార్థులకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ సింగవరం సురేందర్‌రెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 29న క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాదినోత్సవం నాడు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైమన్‌రావు, ఎస్‌ఎంసీ సభ్యుడు ఎద్దుల రవి పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు

దుత్తలూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో దుత్తలూరు సెంటర్‌లో సోమవారం నుంచి ఈ నెల 31 వరకు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31న గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని భక్తులు హాజరై వేడుకలను జయప్రదం చేయాలని కోరారు

వామ్మో హైవే!

565వ నంబరు హైవే నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం

- పలుచోట్ల దెబ్బతిని ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు
- మార్జిన్లను ఆక్రమించిన కంపచెట్లు
- అలంకారప్రాయంగా దీపాలు
- కనిపించని హైవే అంబులెన్స్ నంబరు బోర్డులు
- పట్టించుకోని హైవే నిర్వాహకులు



నెర్రెలు బారిన జాతీయ రహదారి



దెబ్బతిని ప్రమాదభరితంగా ఉన్న హైవే

దుత్తలూరు: 565వ నంబరు జాతీయ రహదారి అధ్వానంగా తయారైంది. నిర్వహణ లోపంతో పలుచోట్ల హైవే దెబ్బతిని గుంతలు, నెర్రెలు బారి ఎత్తుపల్లాలుగా దర్శనమిస్తోంది. మార్జిన్లను సైతం ముళ్ల చెట్లు ఆక్రమించాయి. హైవేపై కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన దీపాలు అలంకారప్రాయంగా మారాయి. బ్లాక్‌స్పాట్‌లు, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో నిర్వహణ సంస్థ కనీసం ఎలాంటి ప్రమాద సూచికలను సైతం ఏర్పాటు చేయడం లేదు. దీంతో వాహనచోదకులు వామ్మో హైవే అంటూ బెంబేలెత్తుతున్నారు.

అధ్వానంగా హైవే

తెలంగాణ రాష్ట్రం నకిరేకల్లు నుంచి తిరుపతి జిల్లా ఏర్పేడు వరకు నిర్మించిన 565వ నంబరు జాతీయ రహదారి జిల్లా పరిధిలో సుమారు 65 కి.మీ. మేర ఉంది. జిల్లా పరిధిలో జాతీయ రహదారి నిర్వహణపై నిర్వహణ సంస్థ నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో పలుచోట్ల హైవే దెబ్బతిని గుంతలు, నెర్రెలు బారి దర్శనమిస్తోంది. హైవేపై వర్షపు నీరు నిల్వ లేకుండా పక్కాగా నిర్మాణం చేపట్టాలి. కానీ నిర్మాణ లోపంతో పలుచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండి రోడ్డు దెబ్బతింటోంది. గుంతలు, నెర్రెలు బారిన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా హైవే నిర్వహణ సంస్థ నిర్లక్ష్యం వహిస్తోంది. రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్‌లు, పశువుల సంచారం ఉన్న ప్రాంతాల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. రోడ్డు మార్జిన్లను ఆక్రమించిన కంపచెట్లను సైతం తొలగించడం లేదు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలపాలవుతున్నారు.

పట్టని పచ్చదనం

వాహనాలు విడుదల చేసే కాలుష్యాన్ని నివారించేందుకు హైవేకు ఇరువైపులా మొక్కలను పెంచాలి. హైవే డివైడర్లలో ఆహ్లాదకరంగా కనిపించేలా పూల మొక్కలను పెంచాలి. కానీ హైవే నిర్వహణ సంస్థ తూతూమంత్రంగా మొక్కలను పెంచుతూ పచ్చదనాన్ని గాలికొదిలేసింది

పాత రోడ్డును విస్మరించారు

దుత్తలూరు సెంటర్ నుంచి దుత్తలూరు ప్రధాన గ్రామం మీదుగా వెళ్లే పాతరోడ్డు నిర్వహణను హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులు విస్మరించారు. ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ మరమ్మతులను చేపట్టకపోవడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు నరకాన్ని చవిచూస్తున్నారు.



గుంతలమయంగా దుత్తలూరు రోడ్డు

వెలగని దీపాలు



దుత్తలూరు సెంటర్‌లో హైవేపై అలంకారప్రాయంగా మారిన దీపాలు

హైవేపై పలు గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన దీపాలు వెలగడం లేదు. క్రాస్‌లు, కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన దీపాలు అలంకారం ప్రాయంగా మారడంతో చీకటిపడితే అంధకారం నెలకొంటోంది. దీంతో హైవేను క్రాస్ చేయాలంటే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

కనిపించని అంబులెన్స్ నంబరు బోర్డులు

జాతీయ రహదారిపై ఏదైనా ప్రమాదం జరిగితే క్షతగాత్రులను తరలించేందుకు ప్రత్యేకంగా అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సేవలకు సంబంధించి ప్రత్యేకంగా 1033 నంబరు ఉన్నా దాని గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. జాతీయ రహదారి వెంబడి హైవే అంబులెన్స్ నంబరును తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కువ మంది 108 వాహనాన్నే వినియోగిస్తున్నారు. ఆ వాహనం మరో కేసుకు వెళ్లి రావడం ఆలస్యమైతే క్షతగాత్రుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.



అలంకారప్రాయంగా అంబులెన్స్

భూగర్భజల మట్టం పరిశీలన

మర్రిపాడు: మండలంలో భూగర్భజల మట్టాన్ని జీయాలజిస్టులు ఆదివారం పరిశీలించారు. మర్రిపాడుతో పాటు పలు గ్రామాల్లో భూగర్భ జల మట్టాలను వారు పరిశీలించారు. ప్రతి మూడు నెలలకోసారి భూగర్భజల మట్టాన్ని పరిశీలించి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

సంగం: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్థానిక గంగమ్మ తల్లి ఆలయంలో సామూహిక కుంకుమార్చనను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంగమ్మకు విశేషాభిషేకాలు నిర్వహించి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహిళలు సామూహికంగా కుంకుమార్చన జరిపారు.

కావలి కాలువకు నీటి విడుదల



సంగం: స్థానిక ఎంజీఆర్ సంగం బ్యారేజ్ నుంచి బెజవాడ పాపిరెడ్డి(కావలి) కాలువకు ఇరిగేషన్ అధికారులు నీటిని ఆదివారం విడుదల చేశారు. సోమశిల జలాశయం నుంచి ఎంజీఆర్ సంగం బ్యారేజ్‌కు 550 క్యూసెక్కులను విడుదల చేశారు. ఈ నీటిని బెజవాడ పాపిరెడ్డి కాలువకు 350, కనిగిరి రిజర్వాయర్‌కు మరో 200 క్యూసెక్కులను విడుదల చేశారు.

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం



సంగం: మహిళలకు చెక్‌ను అందజేస్తున్న ఎంపీపీ



ఉదయగిరి: సీఆర్పీలకు ప్రశంసాపత్రాల అందజేత

సంగం: స్వయం సహాయక సంఘాల సభ్యులను లక్షాధికారులను చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లాఖ్‌పతీ దీదీ కార్యక్రమాన్ని మండల వెలుగు కార్యాలయంలో ఏపీఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా పొదుపు మహిళలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉపన్యాసాన్ని లైవ్ ద్వారా వినిపించారు. అనంతరం ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ, సర్పంచ్ రమణమ్మ చేతుల మీదుగా లాఖ్‌పతీ దీదీ కార్యక్రమానికి హాజరైన పొదుపు మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. 217 స్వయసహాయక సంఘాలకు రూ.12,62,50,000 బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లాఖ్‌పతీ దీదీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. పొదుపు మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా జీవనోపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకుని లక్షాధికారులను చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పొదుపు మహిళలు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ఉదయగిరి: మహిళలు తమ స్వశక్తితో జీవించేలా చేయడమే కాకుండా, వారిని లక్షాధికారులుగా తయారు చేయడమే కేంద్ర ప్రభుత్వ లాఖ్‌పతీ దీదీ పథకం ముఖ్య ఉద్దేశమని వెలుగు ఏపీఎం ఖాజర సూల్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో లాఖ్‌పతీ దీదీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని వినిపించారు. అనంతరం సీఆర్పీలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ లాఖ్‌పతీ దీదీ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు కుటుంబ ఖర్చులు పోనూ ప్రతి నెలా రూ.10వేలు మిగులు ఆదాయంతో ఏడాదికి రూ.లక్ష సంపాదించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలో 8800 మంది మహిళలు ఉండగా, తొలి విడతగా 1750 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

మహాకరుణ శాకాహార సద్భావన యాత్ర



సంగం: సంగంలోని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో మహాకరుణ శాకాహార సద్భావన యాత్రను ఆదివారం నిర్వహించారు. శాకాహారంపై అవగాహన కల్పిస్తూ స్థానిక వెంకయ్యస్వామి ఆలయం నుంచి రాజరాజేశ్వరీదేవి ఆలయం వరకు యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మూగజీవులపై కరుణ చూపాలన్నారు. మాంసాహారాన్ని వదిలి ప్రతి ఒక్కరూ శాకాహారం వైపు మొగ్గుచూపాలన్నారు.

పోలీసు బాస్‌లు కాస్తా గమనించరూ..



శిథిలావస్థకు చేరిన బాలల పోలీసు స్టేషన్

కావలి: పట్టణంలో ఎంతో ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన బాలల పోలీసు స్టేషన్‌ను సాక్షాత్తు పోలీసులే మరిచిపోయారు. పోలీసు వ్యవస్థపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు కావలిలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ పక్కనున్న ఖాళీ స్థలంలో బాలల పోలీస్ స్టేషన్‌ను 1998లో ఏర్పాటు చేశారు. పోలీసులు, వారి విధులు, శాంతి భద్రతల పరిరక్షణకు చేసే కృషి, పోలీసులకు పౌరులు అందించాల్సిన సహకారం తదితర విషయాలను భావిభారత పౌరులకు తెలియజేసేందుకు అవసరమైన ఏర్పాట్లను ఈ స్టేషన్‌లో చేశారు. అలాగే చిన్నారులు ఆడుకోవడానికి ఆట వస్తువులను సైతం ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్ ఆలనాపాలనను పోలీసు అధికారుల నిర్లక్ష్యంతో స్థానిక పోలీసులు విస్మరించారు. దీంతో బాలల పోలీస్ స్టేషన్ క్రమంగా శిథిలావస్థకు చేరింది.


అధికారుల 'పచ్చ'పాతం



విద్యుత్ అధికారులు కనెక్షన్ ఇచ్చిన టీడీపీ నాయకుడి దుకాణం

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులు 'పచ్చ'పాతం వహిస్తున్నారు. చిన్నస్థాయి నుంచి పెద్దస్థాయి అధికారుల వరకు పచ్చనేతలకు జీహుజూర్ అంటున్నారు. వారికో న్యాయం..మిగిలిన వారికో న్యాయమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వారికి ఏ విషయంలోనైనా ఎస్ చెబుతున్నారు. మిగిలిన వారికి 'నో' చెబుతూ చుక్కలు చూపిస్తున్నారు. ఇదే తీరుగా చేజర్ల మండలంలోని అధికారులు వ్యవహరిస్తున్నారు. ఆదూరుపల్లిలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాలకు సంబంధించి టీడీపీ వారికి విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసిన అధికారులు మిగిలిన వారికి మాత్రం నిబంధనల పేరుతో నిరాకరించారు. వివరాలు.. చేజర్ల మండలం ఆదూరుపల్లిలో చేజర్ల రోడ్డు మలుపు వద్ద రోడ్డు పక్కన పలువురు చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వాటికి విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ అధికారులను సంప్రదించగా, పంచాయతీ కార్యదర్శి వద్ద ఎన్‌ఓసీ తీసుకురావాలని తెలిపారు. దీంతో దుకాణాలు నిర్మించుకున్న ఒకరిద్దరు ఎన్‌ఓసీ కోసం పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులును సంప్రదించగా ఆయన టీడీపీ మద్దతుదారులకు మాత్రమే సర్టిఫికెట్లు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలమైన వారికి మాత్రం నిబంధనల పేరు చెబుతూ ఇచ్చేందుకు నిరాకరించారు. కాగా ఈ అనుమతి పత్రాలు చూపిన వెంటనే టీడీపీకి చెందిన గ్రామ నాయకుడి వ్యాపార గదికి విద్యుత్ అధికారులు నెల క్రితం కనెక్షన్ ఇచ్చారు. సదరు దుకాణంలో టీడీపీ నాయకుడు తినుబండారాలను విక్రయించడంతో పాటు మందుబాబులకు మద్యం సేవించేందుకు అవకాశం ఇచ్చారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులును సంప్రదించగా తాను నివాస గృహానికి మాత్రమే ఎన్‌ఓసీ ఇచ్చానని, వ్యాపార గదికి ఇవ్వలేదని తెలపడం విశేషం. కాగా విద్యుత్‌శాఖ ఆత్మకూరు ఏడీఈ సంప్రదించగా గతంలో చేజర్ల మండలం పొదలకూరు పరిధిలో ఉండేదని, ఇటీవల ఆత్మకూరు విద్యుత్ శాఖ పరిధిలోకి చేరిందన్నారు. ఎన్‌ఓసీ ఆధారంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ఉంటారని పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు



ఆదూరుపల్లిలో చేజర్ల రోడ్డు మలుపు వద్ద చిన్నపాటి దుకాణం పెట్టుకున్నా. విద్యుత్ అధికారుల వద్దకు విద్యుత్ కనెక్షన్ కోసం వెళితే ఎన్‌ఓసీ తీసుకురమ్మన్నారు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే అది ప్రభుత్వ స్థలమని ఎన్‌ఓసీ ఇవ్వలేదు. పక్కనే దుకాణం ఏర్పాటు చేసుకున్న టీడీపీ మద్దతుదారుడికి ఇచ్చారు కదా అని అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. విద్యుత్ శాఖ అధికారులను వేడుకున్నా వారు పట్టించుకోవడంలేదు. ఇదెక్కడి న్యాయమో అధికారులే చెప్పాలి.

– చీర్ల రమణయ్య, ఆదూరుపల్లి

జీవితం దేవుడిచ్చిన వరం



మంచిమాట కార్యక్రమంలో మాట్లాడుతున్న నారాయణరావు

ఆత్మకూరు: ప్రతి వ్యక్తికి జీవితం దేవుడిచ్చిన వరమని, ఉన్నంతలో అవసరమైన వారికి సహాయం చేస్తూ సంతృప్తిగా జీవించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో మంచి మాట కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవించడం ఒక కళ–జీవితం దేవుడిచ్చిన వరం అనే అంశంపై పలువురు వక్తలు ప్రసంగించారు. అసంతృప్తి, అత్యాశ, ఈర్ష్య మనిషికి శత్రువులు అని, వాటిని దరిచేరనివ్వకుండా ఉంటే జీవితం ఆనందమయం అవుతుందన్నారు. కొందరు మాత్రమే జీవితాన్ని సాఫల్యం చేసుకుంటూ జీవిస్తారని, వారిని ఆదర్శంగా తీసుకుని జీవిత శైలిని మార్చుకుని మంచి మార్గంలో అజాతశత్రువులా జీవితం కొనసాగించాలన్నారు. సేవా సమితి కార్యవర్గసభ్యులు ఎస్ సుబ్బరాయుడు, అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి, కంచి పరమేశ్వరరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం వెలిశెట్టి నారాయణరావు, గోవిందరెడ్డి, శేషారెడ్డి, రమణయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న మల్లికార్జున

ఉదయగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం ప్రమాదకరంలో పడిందని సీపీఎం నాయకులు షేక్ షర్ఫుద్దీన్ బాషా, గుజ్జుల మల్లికార్జున అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన ఉదయగిరి నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో వారు మాట్లాడారు. రాజకీయాలు వ్యాపారంగా మారిన నేపథ్యంలో రైతుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రైతులు బతకాలంటే పోరాటం తప్పదన్నారు. ప్రభుత్వాలు తమ విధానాలు మార్చుకోకపోతే రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ,, నేతలు కాకు వెంకటయ్య, నాయబ్ రసూల్, కోడె రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు : మండలంలోని అశ్వనీపురం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరు స్వలగాయాలతో బయటపడ్డారు. వివరాలు.. పట్టణానికి చెందిన షేక్ ఇబ్రహీం, అజయ్, వీ విజయ్ స్నేహితులు. ముగ్గురు పదోతరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవుకావడంతో సరదాగా సోమశిల జలాశయ సందర్శనకు మోటార్ సైకిల్‌పై వెళ్లారు. తిరిగి ఆత్మకూరుకు వస్తున్న క్రమంలో అశ్వనీపురం సమీపంలో రోడ్డుపై వెళ్తున్న గేదెను గమనించక ఢీకొన్నారు. దీంతో రోడ్డుపై ముగ్గురు పడిపోయారు. ఈ ఘటనలో ఇబ్రహీం తలకు తీవ్రగాయమవగా, మిగిలిన ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇబ్రహీంను తొలుత ఆత్మకూరులోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్



కావలి: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. రైల్వే స్టేషన్ ఎంట్రెన్స్ వద్ద మెట్లకు అడ్డంగా, ప్లాట్‌ఫామ్‌పైన బైక్‌లను పార్కింగ్ చేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్ ఎంట్రెన్స్ వద్ద మెట్లకు అడ్డంగా స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఉద్యోగులే దర్జాగా తమ బైక్‌లను పెట్టేస్తుండడంతో ప్రయాణికులు పక్క నుంచి వెళ్లాల్సి వస్తోంది. మరికొందరు తమ బైక్‌లను నేరుగా రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లపైకి తీసుకెళ్లి పార్కింగ్ చేస్తున్నారు. ప్రయాణికులకు ఆదర్శంగా ఉండాల్సిన ఉద్యోగులే విచ్చలవిడిగా ప్రవర్తిస్తుండడం చూసి వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.